


నామినేటెడ్.. ఆశలు





- టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో నామినేటెడ్ పదవులపై నేతలు, క్యాడర్‌లో ఆశలు
- ఇన్నేళ్ల కష్టం, పోరాటానికి ఫలితం దక్కబోతుందని ఆనందం
- పనిచేసిన ప్రతిఒక్కరినీ పదవులతో గుర్తిస్తానని తాజాగా అధినేత చంద్రబాబు హామీ
- ఈ నేపథ్యంలో రాష్ట్ర, జిల్లాస్థాయి పదవులపై ఆశావహుల కన్ను
- అమాత్యగిరీ దక్కని జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలూ నామినేటెడ్ పదవులపై ఆసక్తి
- టీటీడీ బోర్డు, కార్పొరేషన్ల చైర్మన్, అసెంబ్లీ కమిటీల పోస్టులపై కన్ను
- పిఠాపురంలో పవన్ కోసం సీటు త్యాగం చేసిన వర్మ ఎమ్మెల్సీ కోసం ఎదురుచూపు
- పార్టీ అధికారంలోకి రాగానే తొలి ఎమ్మెల్సీ ఇస్తానని ఇప్పటికే చంద్రబాబు హామీ
- తాజాగా రెండు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ జారీతో అధినేతను కలిసిన వర్మ

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

టీడీపీ అధికారంలోకి రావడంతో జిల్లాలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఆనందం తొణకిసలాడుతోంది. అయిదేళ్ల పోరాటం, కష్టానికి తగ్గట్లు కల నెరవేరడంతో ఎవరికివారు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ కోసం కష్టపడ్డ వారికి త్వరలో నామినేటెడ్ పదవులు ఇచ్చి గుర్తిస్తామని అధినేత చంద్రబాబు నాలుగురోజుల కిందట ప్రకటించడంతో నేతలు, క్యాడర్ ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. ఇన్నేళ్ల కష్టానికి గుర్తింపు రాబోతోందని ఆనందపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికివారు తమకు నామినేటెడ్ పదవి దక్కకపోతుందా అని ఆశలు పెంచుకుంటున్నారు. రాష్ట్ర, జిల్లాస్థాయిలో ఎక్కడ అవకాశం వస్తుందోనని లెక్కలు వేసుకుంటున్నారు. అందులోభాగంగా తమకు పదవి దక్కేలా ప్రయత్నాలు మొదలుపెట్టారు. జిల్లా ఎమ్మెల్యేలు సైతం అమాత్యగిరీ వస్తుందని ఆశపడ్డా, ఛాన్స్ మిస్ అవడంతో ఏదొక పోస్టు వస్తుందని అంచనాలు వేసుకుంటున్నారు. ప్రధానంగా సీనియర్ ఎమ్మెల్యేలు తమకు టీటీడీ బోర్డు లేదా ఇతర కార్పొరేషన్లలో అవకాశం ఉంటుందేమోనని అని లెక్కలేస్తున్నారు. అటు పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కోసం సీటు త్యాగం చేసి టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ ఎమ్మెల్సీ పదవి దక్కుతుందనే ఆశతో ఉన్నారు. తాజాగా ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో తనకు ఛాన్స్ ఖాయమని నమ్ముతున్నారు. ఇప్పటికే ఆయన చంద్రబాబును కూడా కలిశారు.

ఎక్కడెక్కడ ఏమున్నాయో..

గడచిన ఐదేళ్లలో గత వైసీపీ ప్రభుత్వం అనేక అరాచకాలకు పాల్పడింది. అడుగడుగునా అవినీతి, అక్రమాలతో రెచ్చిపోయింది. అధికార పార్టీ దౌర్జన్యాలు, ఆగడాలపై పోరాడిన ప్రతిపక్ష టీడీపీ నేతలపై కేసులు, వేధింపులతో రెచ్చిపోయింది. అయినా వీటిని లెక్కచేయకుండా గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పార్టీ నేతలు, కార్యకర్తలు కసిగా పోరాడారు. కేసులు లెక్క చేయకుండా ఎదురు నిలిచారు. అనుకున్నట్లే తాజా అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం అఖండ మెజార్టీతో చరిత్ర సృష్టించింది. తిరిగి టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా పీఠం ఎక్కారు. దీంతో అయిదేళ్ల పోరాటం, కష్టాలకు అధికారం దక్కిందని జిల్లాలో పార్టీ నేతలు, కార్యకర్తల్లో సంతోషం నెలకొంది. ఇన్నేళ్ల కష్టాలు, బాధలు తొలగిపోయాయని అంతా సంబరపడుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధికారంలోకి రావడంతో త్వరలోనే నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తానని చంద్రబాబు నాలుగురోజుల కిందట ప్రకటించారు. ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు, క్యాడర్‌తో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఇదే విషయం వెల్లడించారు. అయిదేళ్ల పార్టీకోసం పోరాడిన నేతలు, కార్యకర్తలను దిగువస్థాయి నుంచి పైవరకు గుర్తించి పదవులు కట్టబెడతానని వివరించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో నామినేటెడ్ పదవులపై పార్టీ నేతలు, క్యాడర్‌లో ఆశలు మొదలయ్యాయి. పార్టీ కోసం కష్టపడ్డందుకు ఏదొక పదవి వరిస్తుందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. అందులోభాగంగా ఎవరికివారు తమకు కచ్చితంగా గుర్తింపు వస్తుందనే లెక్కలు వేస్తున్నారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఏయే పదవులు భర్తీ చేయవచ్చో, వాటిలో ఏవి తమకు బాగుంటాయోనని ఎవరికివారు అంచనాలు వేసుకుంటున్నారు. ఎలాగైనా పదవి వచ్చేలా ప్రయత్నాలు కూడా మొదలుపెట్టారు. కొందరు ఇప్పటికే ఎమ్మెల్యేలు, పార్టీలో ఇతర సీనియర్ నేతలను ఛాన్స్‌లకోసం కలుస్తున్నారు. ప్రధానంగా నియోజకవర్గ, జిల్లాస్థాయిలో ఆలయ చైర్మన్‌లు, బోర్డు సభ్యులు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ పోస్టులు, కుడా, స్మార్ట్‌సిటీ చైర్మన్‌లు, గ్రంథాలయ సంస్థ, ఆర్టీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, వివిధ కార్పొరేషన్లలో పదవులపై కన్నేసి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇవికాక ఇంకా ఏయే వాటిలో అవకాశం ఉంటుందోనని లెక్కలేస్తున్నారు. మరోపక్క జిల్లాలో ఏడు స్థానాల్లోను టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు విజయం సాధించగా వీరిలో టీడీపీ నుంచి అయిదుగురు ఎమ్మెల్యేలున్నారు. వీరిలో ముగ్గురు సీనియర్ ఎమ్మెల్యేలున్నారు. క్యాబినెట్‌లో ఛాన్స్ ఉంటుందని వీరు భావించారు. అమాత్యగిరీ అవకాశం దక్కుతుందని ఆశపడ్డారు. కానీ సామాజిక సమీకరణాల లెక్కలు, జనసేనకు పదవులు కేటాయించాల్సి రావడంతో ఎవరికీ అవకాశం దక్కలేదు. ఈ నేపథ్యంలో కీలకమైన నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం రావొచ్చేమోనని పలువురు భావిస్తున్నారు. ప్రధానంగా టీటీడీ బోర్డు సభ్యులు పదవులనుంచి కీలకమైన కార్పొరేషన్లు, అసెంబ్లీ కమిటీల్లో చోటు ఉండొచ్చని భావిస్తున్నారు. అనుకున్న పదవులు రాకపోయినప్పటికీ వీరంతా అధినేత చంద్రబాబు దృష్టిలో ఉన్నారు. దీంతో తమకు కచ్చితంగా ఛాన్స్ ఉంటుందని ఎవరికివారే లెక్కలు వేస్తున్నారు.

నోటిఫికేషన్ వచ్చేసింది..

పిఠాపురం నుంచి ఈ ఎన్నికల్లో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పోటీచేయడంతో అక్కడున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మకు అసెంబ్లీ సీటు దక్కలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికలప్పుడు పార్టీ అధినేత చంద్రబాబు వర్మను పిలిపించుకుని మాట్లాడారు. సీటు ఇవ్వలేకపోయిన నేపథ్యంలో పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ పదవి ఇచ్చి న్యాయం చేస్తానని బహిరంగంగా మాట ఇచ్చారు. దీంతో చంద్రబాబు ఆదేశాల మేరకు పిఠాపురంలో పవన్‌కళ్యాణ్ విజయం కోసం పార్టీ తరఫున వర్మ కుటుంబంతో సహా కష్టపడ్డారు. అనుకున్నట్లుగానే పవన్ భారీమెజారిటీతో విజయం సాధించారు. మరోపక్క పవన్ సైతం ఎన్నికల ప్రచార సభల్లో వర్మ లాంటి నేత చట్టసభల్లో ఉండాలని పేర్కొన్నారు. దీంతో తనకు ఎలాగైనా పదవి లభిస్తుందని వర్మ ధీమాగా ఉన్నారు. ఇప్పుడు అనూహ్యంగా ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ పదవుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవుల భర్తీకి వచ్చే నెల్లో ఎన్నిక జరగనుంది. పైగా అసెంబ్లీలో టీడీపీకి తిరుగులేని బలం ఉండడంతో ఈ మూడు టీడీపీకే దక్కనున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ పదవి వస్తుందని వర్మ ధీమాగా ఉన్నారు. తాజాగా పార్టీ అధినేత చంద్రబాబును కలిసి విషయాన్ని గుర్తు చేశారు. పవన్ మంత్రిగా అమరావతిలో బుధవారం బాధ్యతలు స్వీకరించడంతో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.

200మందికి పంపమంటే.. 50మందికి పంపారు



గొల్లప్రోలు మండలం చేబ్రోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో 200మంది విద్యార్థులకు వచ్చిన పలావ్

- మిగిలిన వారికి ఆకలి కేకలే
- రికార్డుల్లో మాత్రం పూర్తిగా పంపినట్లు నమోదు
- నాణ్యత లేక ఆహారాన్ని పడవేసిన విద్యార్థులు
- మారని మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు

గొల్లప్రోలు రూరల్, జూన్ 19: కొత్త ప్రభుత్వం కొలువుదీరినా మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకుల తీరు మారడం లేదు. పాత పద్ధతిలోనే ఎక్కువమంది విద్యార్థులకు ఆహారం పంపినట్లు రికార్డుల్లో నమోదు చేసుకుని కనీసం సగం మందికి సరిపడా కూడా పంపడం లేదు. పంపిన ఆహారం నాణ్యత, రుచి లేకపోవడంతో విద్యార్థులు పడవేస్తున్నారు.

జిల్లాలోని గొల్లప్రోలు మండలం సహా పలు మండలాల్లోని జడ్పీ, మండల పరిషత్ పాఠశాలలకు అల్లూరి సీతారామరాజు ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వహణలోని సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మధ్యాహ్న భోజన పథకం ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్నారు. ఈ సొసైటీ పనితీరుపై కొన్నేళ్లుగా ఆరోపణలున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో అధికార పార్టీకి చెందిన రాష్ట్రస్థాయి కీలక ప్రజాప్రతినిధుల అండతో ఎన్ని అవకతవకలకు పాల్పడినా, భోజనం నాణ్యత సరిగా లేకున్నా, సమయానికి ఆహార పదార్థాలు పంపకున్నా, విద్యార్థుల సంఖ్యను ఎక్కువ చూపినా విద్యాశాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా వీరు తమ తీరు మార్చుకోలేదు.

పాఠశాలల్లో ఎంతమంది విద్యార్థులు భోజనం చేస్తారో ముందురోజు సాయంత్రమే హెచ్‌ఎంలు సొసైటీ ప్రతినిధులకు సమాచారం ఇవ్వాలి. విద్యార్థుల సంఖ్య పెరిగితే ఆ రోజు ఉదయమే మళ్లీ సమాచారం ఇస్తే ఆ మేరకు సొసైటీ ప్రతినిధులు ఆహారం పంపాలి. గొల్లప్రోలు మండలం చేబ్రోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 200మంది విద్యార్థులు భోజనం చేస్తారని మంగళవారం సాయంత్రం పాఠశాల హెచ్‌ఎం సొసైటీకి సమాచారం ఇచ్చారు. బుధవారం ఉదయానికి ఈ సంఖ్య పెరగడంతో 330మందికి మధ్యాహ్న భోజనం పంపాలని మరోమారు సమాచారం పంపారు. ముందురోజు పంపిన 200మంది విద్యార్థులకే ఆహారం పంపుతున్నట్లు సొసైటీ ఆహారపదార్థాలు రవాణా చేసే వాహనానికి ఇచ్చిన షీటులో పేర్కొన్నారు.

సగం మందికి కూడా రాలేదు

200మంది విద్యార్థులకు పలావ్, బంగాళదుంప కూర పంపాల్సి ఉంది. ఒక గిన్నెలో పలావ్, మరో గిన్నె సగం కంటే తక్కువగా నీళ్ల లాంటి బంగాళదుంప కూరను పంపారు. ఇది 50మందికి కూడా సరిపోదని గుర్తించి పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పలుమార్లు సొసైటీ ప్రతినిధులకు ఫోన్ చేసినా స్పందించలేదు. ఎట్టకేలకు మరో గిన్నెలో పలావు పంపినా అప్పటికే విద్యార్థులు భోజనాలు ముగించి తరగతులకు వెళ్లిపోయారు. 200మందికి ఆహారపదార్థాలు పంపుతున్నట్లు చెప్పి కనీసం 50మందికి సరిపడా పంపకపోవడంతో మిగిలిన వారు ఆకలితో అలమటించాల్సి ఉంది. విద్యార్థుల సంఖ్య పెరిగినట్లు సమాచారం ఇచ్చినా సొసైటీ ప్రతినిధులు పరిగణనలోకి తీసుకోలేదు. మరోవైపు ఆహారం నాణ్యత, రుచి లేకపోవడంతో విద్యార్థుల్లో ఎక్కువమంది దాన్ని తినలేక పడవేశారు. గతంలోనూ ఇదే మాదిరిగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కాకుండా తక్కువమందికి పంపడం, ఆలస్యంగా తీసుకురావడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. గొల్లప్రోలు మండలంతో సహా సొసైటీ ఆహారం పంపే అన్ని మండలాల్లోని పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉంటుందని చెప్తున్నారు. విద్యాశాఖాధికారులు పర్యవేక్షణ లేకపోవడం, పాఠశాలలనుంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చేసే ఫిర్యాదులపై వారు స్పందించకపోవడంతోనే భోజన పథకం అమలు అస్తవ్యస్తంగా మారిందనే ఆరోపణలున్నాయి. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై దృష్టిసారించి మధ్యాహ్నభోజనం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఆహారపదార్థాల నాణ్యత బాగుండేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నాణ్యత, రుచి లేక ఆహారాన్ని పడవేస్తున్న విద్యార్థులు

బడి ఈడు పిల్లలంతా పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలి

- 'నేను బడికి పోతా' ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి: జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో పిల్లి రమేష్

కాకినాడ రూరల్, జూన్ 19: బడిఈడు పిల్లలంతా బయట ఉండరాదని, అర్హులైన విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించే నేను బడికి పోతా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ కోరారు. కాకినాడ డీఈవో కార్యాలయంలో నేను బడికి పోతా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ అండ్ కాంపెయిన్ కార్యక్రమంపై లైన్ డిపార్టుమెంట్ల అధికారులు, జిల్లా సెక్టోరల్ అధికారులతో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13 నుంచి జూలై 12వరకు అన్ని గ్రామాల్లో నేను బడికి పోతా కార్యక్రమం చేపట్టాలన్నారు. 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలు ఎవరూ బయట ఉండరాదని, వీరిని గుర్తించి నూరుశాతం పాఠశాలల్లో చేరేలా కృషి చేయాలన్నారు. డ్రాప్ అవుట్ పిల్లలందరినీ తిరిగి పాఠశాలలకు తీసుకువచ్చేలా గ్రామ, మండలస్థాయిలో కమిటీలు వేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు లైన్ డిపార్ట్‌మెంటు అధికారులు అవగాహన శిబిరాలు, విద్య ప్రాముఖ్య తమపై పోస్టర్లను విడుదల చేయాలన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, స్కూల్ హెచ్‌ఎంలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో నేను బడికిపోతా ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీజలు, పార్టు టైం ఇన్‌స్ట్రక్టర్లు, కేజీబీవీసీఆర్‌టీలు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి ఇంటింటా సందర్శన చేపట్టి జీరో ఓఎస్‌సీ ఆవాస ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని కోరారు. డీపీవో టి.ఆమని, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బుల్లి రాణి, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, మెప్మా పీడీ ప్రియంవద, ఉపవిద్యాశాఖాధికారులు నాయుడు వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ కె.హరికృష్ణ, సీఎంవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అనుమానం పెనుభూతమై.. (5లో)
- భార్యను హతమార్చిన భర్త
- కాకినాడ రూరల్ హార్బర్ పేట హత్య కేసు ఛేదన

కొత్తపల్లిలో ప్రియుడి ఇంటి ముందు యువతి ఆందోళన (5లో)

కోలుకుంటున్న కొమ్మనాపల్లి (5లో)

స్టాంపు పేపర్ల కొరత



- సంస్కరణల పేరుతో నిలిపివేసిన రిజిస్ట్రేషన్ల శాఖ
- ప్రత్యామ్నాయంగా ఈ-స్టాంపు పేపర్లు
- వాటితో పలు సమస్యలు

పెద్దాపురం, జూన్ 19: జిల్లాలో స్టాంపు పేపర్ల కొరత అధికంగా ఉంది. ఎక్కువ రేటు పెట్టి కొనుగోలు చేద్దామన్నా దొరకడం లేదు. సంప్రదాయ పద్ధతిలో రిజిస్ట్రేషన్లకు ఎరుపు, ఆకుపచ్చ, నీలం రంగులతో కూడిన స్టాంపు పేపర్లు ఏడాది క్రితం వరకూ అందుబాటులో ఉండేవి. వీటిని నాసిక్‌లో ముద్రిస్తే అన్ని రాష్ట్రాలు కొనుగోలు చేసేవి. ఒకసారి స్టాంపు పేపరు కొనుగోలు చేస్తే వీలైనప్పుడు దాన్ని వినియోగించుకునే అవకాశం ఉండేది. దీనివల్ల అక్రమాలు జరుగుతున్నాయని, అవసరమైనన్ని స్టాంపు పేపర్లు అందుబాటులో లేవని, రవాణా వ్యయం ఎక్కువ అవుతోందని ఇలా పలు కారణాలను చూపించి రిజిస్ట్రేషన్ల శాఖ సంస్కరణల పేరుతో వీటిని నిలిపివేసింది. ఆ స్థానంలో ఈ-స్టాంపింగ్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. స్టాంపు వెండర్లకే ఫ్రాంకింగ్ మిషన్లు ఇచ్చి వాటి ద్వారా ప్రింటింగ్ తీసుకునే వెసులుబాటు కల్పించింది. దీనికి రూ.40వేల నుంచి రూ.50వేలు పెట్టుబడి పెట్టాల్సి రావడంతో కొందరు వెండర్లు ఈ వ్యాపారం నిలిపివేశారు. దీంతో ప్రభుత్వం నుంచి కాంట్రాక్టు తీసుకున్న సంస్థే పలు కేంద్రాలను నెలకొల్పి వీటిని విక్రయిస్తోంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా వీటిని అందుబాటులో ఉంచారు. పాత స్టాంపు పేపర్లు ఎవరి దగ్గరైనా ఉంటే వాటిపై రిజిస్ట్రేషన్లు ఎప్పటిలాగే అనుమతిస్తున్నారు. దీంతో చాలామంది గతంలో కొనుగోలు చేసినవి, పక్క రాష్ట్రాల నుంచి తెచ్చుకున్నవి ఉపయోగించుకుంటున్నారు. వాటిపైనే లావాదేవీలు రాసుకుంటున్నారు. పదికాలాలు దాచుకునే పత్రం కావడంతో ఎక్కువమంది పాతస్టాంపు పేపర్లకే మొగ్గు చూపుతున్నారు.

ఈ-స్టాంపులతో సమస్య..

ఈ-స్టాంపు పత్రాలతో సమస్యలు ఉన్నాయి. పాత స్టాంపు పేపరు కొనుక్కుంటే దానితో ఏరకమైన లావాదేవీ అయినా చేసుకోవచ్చు. సేల్ డీడ్ రాసుకోవచ్చు. ఒప్పందం చేసుకోవచ్చు. డెవలప్‌మెంట్, అగ్రిమెంట్, దానపట్టా, ఇలా ఏదైనా రాసుకునే వెసులుబాటు ఉంది. కానీ ఈ-స్టాంపులో అది లేదు. దాన్ని కొనే సమయంలో దేనికోసం కొనుగోలు చేస్తున్నామో ప్రశ్నిస్తారు. ఈ ప్రయోజనానికే దాన్ని వాడాలి. సేల్ డీడ్‌కు స్టాంపు తీసుకుని దానిపై దానపట్టా రాస్తే సబ్ రిజిస్ట్రార్ అంగీకరించరు. మరో స్టాంపు పేపరు అదే ప్రయోజనం కోసం కొని రాయించుకుని రావాలని తిరస్కరిస్తున్నారు. దీనివల్ల తెలియని వారు ఇబ్బంది పడుతున్నారు.

అదనపు మొత్తాల వసూలు..


స్టాంపు వెండర్లకు ప్రభుత్వం గతంలో కమీషన్లు ఇచ్చేది. ఇప్పుడు ఆ విధానం సరిగ్గా అమలు చేయడం లేదు. దాంతో వెండర్లు ప్రతి ఈ స్టాంపు పేపరు అమ్మకంపై రూ.20 నుంచి రూ.30 అధికంగా తీసుకుంటున్నారు. రూ.10 స్టాంపునకు రూ.10, రూ.20, రూ.50 స్టాంపులకు అదనంగా రూ.20, అదే రూ.వంద స్టాంపునకు రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారు. ఇలా ఎక్కువ మొత్తం పెట్టినా కొన్ని చోట్ల ఇవి వెంటనే దొరకడం లేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్యూలో నిలబడితే తప్ప కొన్నిచోట్ల లభించడం లేదు. దీంతో వీటిపై చాలామంది ఆసక్తిచూపడం లేదు. కొన్ని కేంద్రాల్లో ఫ్రాంకింగ్ మెషిన్లు పనిచేయడం లేదు. ఈ కారణాలతో చాలామంది పాత స్టాంపు పేపర్ల కొనుగోలుకే ఆసక్తి చూపుతున్నారు.

కొరత ఉన్నమాట వాస్తవమే

స్టాంపు పేపర్లు కొరత ఉన్నమాట వాస్తవమే. నాసిక్ నుంచి పేపర్లు రావడంలేదు. స్టాంపు పేపర్లకు ప్రత్యామ్నాయంగా ఈ-స్టాంపు పేపర్లు వాడుకోవచ్చు. వీటిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఈవిధానం నడుస్తోంది.

-రామలక్ష్మి పట్నాయక్, జిల్లా రిజిస్ట్రార్, కాకినాడ

జిల్లా కలెక్టర్‌ను కలిసిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 19: నూతనంగా ఎన్నికైన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ జె.నివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గం అభివృద్ధికి సహకారం అందించాలని ఆమె కోరారు.

అంటకాగిన అధికారుల్లో దడ

- టీడీపీ నేతలకు ప్రసన్నం చేసుకునేందుకు యత్నాలు
- తప్పులు కప్పిపుచ్చుకునేందుకు మార్గాల అన్వేషణ
- అవినీతికి పాల్పడి లక్షలాది రూపాయలు స్వాహా

సామర్లకోట, జూన్ 19: ఐదేళ్లుగా వైసీపీ పాలనలో తప్పులు చేసిన అధికారులు తప్పించుకునేందుకు మార్గాలు అన్వేషించుకుంటున్నారు. ఎలాగైనా ఉపద్రవం నుంచి బయటపడేందుకు టీడీపీ నాయకులను ప్రసన్నం చేసుకునే యత్నాలు చేస్తున్నారు. మండల పరిషత్, పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, హౌసింగ్, విద్యుత్‌శాఖల్లో పలువురు అధికారులతోపాటు పంచాయతీ కార్యదర్శులు వైసీపీ నాయకులకు ఊడిగం చేశారు. కొన్నిశాఖల అధికారులు లక్షలాది రూపాయల మేర దుర్వినియోగం చేశారు. ఆ కోవలోకి హౌసింగ్, మున్సిపల్, మండల పరిషత్‌శాఖల అధికారులు ముందు వరుసల్లో ఉన్నారు. సామర్లకోట హౌసింగ్ పథకం అమలులో భాగంగా డీఈ స్థాయి నుంచి వర్క్ ఇన్‌స్పెక్టర్ స్థాయి సిబ్బంది వరకూ గృహనిర్మాణాల్లోను, బిల్లులు మంజూరు చేయడంలోను పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడ్డారు. పలువురు గృహ లబ్ధిదారులు సాక్ష్యాత్తూ అప్పటి జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాకు సైతం ఫిర్యాదులు చేయడం, విచారణలకు ఆదేశించడం మినహా అవకతవకలకు పాల్పడిన వారిపై ఎటువంటి చర్యలూ లేకపోయాయి. అదే రీతిలో ఇదే కాలనీలో విద్యుత్ మీటర్లకు ఉచితంగా కనెక్షన్లు మంజూరు చేయాల్సిన విద్యుత్ సిబ్బంది డబ్బులు వసూలు చేయడం, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు చేయడంతో రెండు దఫాలు విజిలెన్స్ అధికారులు విచారణలు చేసి వైసీపీ నాయకుల ఒత్తిడితో విచారణల నివేదికలు బుట్టదాఖలు చేశారన్న ఆరోపణలు లబ్ధిదారులనుంచి వినవస్తోంది. దీంతో గృహనిర్మాణ, విద్యుత్ సిబ్బందిపై నేటికీ ఎటువంటి చర్యలు లేకపోయాయి.

వైసీపీ నేతల ఒత్తిళ్లతో..

మున్సిపాల్టీలో స్థానిక ప్రజాప్రతినిధుల ఇళ్లవద్ద మున్సిపల్ కాంట్రాక్ట్ సిబ్బంది ఆధ్వర్యంలో పనులు చేయించుకోవడమే గాక సదరు సిబ్బంది వైసీపీ నాయకుల మద్దతుతో అక్రమ వసూళ్లకు, చీటింగ్‌లకు పాల్పడుతున్నా ఎవరిపైనా చర్యలు లేవు. చీటింగ్ నేరంలో అరెస్టు అయ్యి జైలుకు వెళ్లిన ఒకరికి తిరిగి మున్సిపాల్టీలో అవుట్‌సోర్సింగ్‌లో ఉద్యోగాన్ని కల్పించడం వెనుక అధికారులు వైసీపీ నాయకులకు దాసోహం అయ్యారన్న ఆరోపణలు అనేకం ఉన్నాయి. ఇంకా మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులపై పలువురు వైసీపీ నాయకులు తీవ్రమైన ఒత్తిళ్లు తెచ్చి ఆక్రమణలు, కబ్జాలు మాత్రమే గాకుండా కబ్జాలు చేసిన స్థలాలను అద్దెలకు ఇచ్చి అక్రమార్జనలకు అధికారులే సహకరించారన్న ఆరోపణలు అనేకం ఉన్నాయి. విద్యుత్ శాఖలో ఇటీవలే చేరిన ఒక అధికారి చేస్తున్న అక్రమాలు తన పై స్థాయి అధికారిని సైతం లెక్కించకుండా అజమాయిషీ చేయడం వెనుక వైసీపీ నాయకులు సదరు ఈ అధికారికి అండదండగా ఉండడమేనని తెలుస్తోంది. దీంతో అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారుల భరతం పట్టాలని, వైసీపీతో అంటకాగిన అధికారులకు గుణపాఠం చెప్పాలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పట్టుదలతో ఉన్నారు. అందుకు అవసరమైన పూర్తి సమాచారం సేకరిస్తున్నారు.

రేపు 'వికాస్'లో ఉద్యోగ మేళా

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 19: ఈనెల 21న జిల్లా కలెక్టరేట్ పరిధిలో ఉన్న వికాస్ కార్యాలయంలో ఉద్యోగ మేళా జరుగుతుందని వికాస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు తెలిపారు. జెన్‌పాక్ట్ కంపెనీలో ప్రాసెస్ అసోసియేట్, కస్టమర్ సర్వీస్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 21న ఉదయం 9గంటలకు హాజరు కావాలన్నారు. ఈ ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన ఉండాలన్నారు. 28ఏళ్ల లోపు గల అభ్యర్థులు అర్హులు. వివరాలకు 7799376444, 7799376111 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కోలుకుంటున్న కొమ్మనాపల్లి

కొత్తగా కేసులు నమోదు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు, వైద్య సిబ్బంది

మరోవైపు బెండపూడిలో కేసులు పెరుగుతుండడంతో ఆందోళన



లీకేజీ పనులు పరిశీలిస్తున్న అధికారులు

తొండంగి,జూన్19: గత పది రోజులుగా డయేరియా వ్యాధి తీవ్రతతో తల్లడిల్లిన కాకినాడ జిల్లా తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామం కోలుకుంది. బుధవారం ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. దీంతో వైద్యులు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటివరకు గ్రామంలో సుమారు వంద కేసుల వరకూ నమోదయ్యాయి. దీంతో గ్రామంలో బేస్ క్యాంపు ఏర్పాటు చేసి ప్రాథమిక చికిత్స అనంతరం అవసరమైన వారిని మూడు అంబులెన్స్‌ల ద్వారా యుద్ధ ప్రాతిపదికన జీజీహెచ్‌కు తరలించేవారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డుల్లో రోగులకు చికిత్స అందించారు. డీఎంహెచ్‌వో నర్సింహనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత తదితర ఉన్నతాధికారుల పర్యవేక్షణలో డాక్టర్ రవికుమార్ డాక్టర్ భారతి రోగులకు నిరంతరాయంగా చికిత్స అందించారు. జిల్లా పంచాయతీ అధికారితో పాటు ఆర్‌డబ్ల్యూఈఎస్ ఎస్ఈ శ్రీనివాసరావు తదితరులు గ్రామంలో పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షించారు. ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా తదితర అంశాలను పర్యవేక్షించి ఆదేశాలు ఇవ్వడంతో ఆ రెండు అంశాలలో ఉన్న లోటుపాట్లు సరి అయ్యాయి. శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించడంతో జిల్లా యంత్రాంగం మొత్తం అప్రమత్తమై మెరుగైన సేవలు అందించింది.

బెండపూడిలో డయేరియా కేసులు

కొమ్మనాపల్లిలో ఒకపక్క కేసులు తగ్గగా మరోపక్క బెండపూడిలో కేసులు నమోదు కావడంతో ఆందోళన చెందుతున్నారు. మొదటి రోజు 18 కేసులు నమోదుకాగా రెండో రోజు 12 కేసులు నమోదయ్యాయి. తుని ఏరియా ఆసుపత్రికి నలుగురిని పంపించగా మరో నలుగురు అక్కడ చేరారు. మరో నలుగురికి స్థానికంగా చికిత్స అందించారు. డీఎంహెచ్‌వో నర్సింహనాయక్, డీఎల్‌పీవో బాలామణి గ్రామాన్ని సందర్శించి వ్యాధి వ్యాప్తికి కారణంగా చెప్తున్న రెండు బావులను మూయించివేశారు. ఓహెచ్‌ఆర్ ట్యాంకు నీటిని కూడా ఆపివేసి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు.పైప్‌లీక్‌లను అరికట్టేందుకు సిబ్బందికి సూచనలు చేశారు. రోగులకు అందుతున్న వైద్య సహాయాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. మలేరియా అధికారి భాస్కరరావు వైద్యాధికారులు కె.అర్చన, ఆర్.లలిత, ఎంహెచ్‌వో రవికుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన టీడీపీ నేతలు

స్థానిక ఎమ్మెల్యే యనమల దివ్య ఆదేశాల మేరకు సీనియర్ టీడీపీ నేతలు యనమల రాజేష్, సుర్ల లోవరాజు బుధవారం బాధితులను పరామర్శించారు. వైద్య సహాయాన్ని అడిగి తెలుసుకున్నారు. శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, శాసన సభ్యురాలు యనమల దివ్య అధికారులకు అవసరమైన సూచనలు చేశారని రోగులు ధైర్యంగా ఉండాలని తెలిపారు. వారి వెంట సాధనాల నూకరాజు తదితరులు ఉన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న యనమల రాజేష్ తదితరులు

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందిస్తున్న దాతలు

అన్నవరం, జూన్ 19: రత్నగిరిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి బుధవారం కాకినాడకు చెందిన వెంకటేశ్వరప్రసాద్, జ్యోతిశ్రీ దంపతులు లక్ష రూపాయలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత ఆలయ సూపరింటెండెంట్ స్వామీజీకి అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ఏపీఆర్వో ఎం.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాలబాలాజీ స్వామి చక్రస్నాన మహోత్సవం



చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

మామిడికుదురు, జూన్ 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు స్వామివారికి వైనతేయ నదిలో చక్ర స్నానాన్ని వైభవంగా నిర్వహించారు. నాలుగో రోజు జ్యేష్ఠ శుద్ధ బుధవారం సుప్రభాతసేవ, నిత్యార్చన, సహస్ర నామార్చన, బాలబోగ నివేదన, నిత్య హోమం, బలిహరణ, తీర్థ ప్రసాద గోష్ఠి, చతుష్టానార్చనలు, వేద పారాయణం, హోమం మంగళాశాసన, మహా పూర్ణాహుతి , బలిహరణ తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని భారీ ఊరేగింపు నడుమ వైనతేయ నది వరకు తీసుకువెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల కోలాహలం నడుమ స్వామివారి ప్రతిమను అర్చకులు శిరస్సున ధరించి స్వామి వారికి చక్రస్నానాన్ని ఆచరింప చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ జి.మాధవి పర్యవేక్షణలో అర్చకుడు చలమచర్ల కృష్ణమాచార్యులు, గొడవర్తి శ్రీనివాసాచార్యులు నిర్వహించారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 19: తిరుపతి జిల్లా వెంకటగిరిలోని శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కళాశాలలో హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్‌పీకేయం ఐజీహెచ్‌టీ ఓఎస్‌డీ ఎస్.గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు రెండు, మూడేళ్ల ఈ కోర్సులో ప్రవేశానికి ఈ నెల 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని చెప్పారు. వివరాలకు 9441795408, 9866169908, 9010243054 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దుర్గాడలో డయేరియా?

గొల్లప్రోలు రూరల్, జూన్ 19: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో డయేరియా జాడలు కనిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన అయిదు సంవత్సరాల పాప వాంతులు విరోచనాలతో బాధపడుతూ ఉండటంతో తొలుత పిఠాపురం సీహెచ్‌సీకి అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనితో అప్రమత్తమయిన వైద్య సిబ్బంది ఆ ప్రాంతంలో ఇంటింటా సర్వెలెన్స్ నిర్వహించారు. మిగిలిన వారికి ఎటువంటి లక్షణాలు లేవని గుర్తించామని వారు తెలిపారు. మంచినీటి శాంపిల్స్ సేకరించారు.



సప్తనదుల జలాలను చూపిస్తున్న అర్చకులు

రేపు సప్తనదీ జ్యేష్ఠాభిషేకం

అంతర్వేది, జూన్ 19: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారికి సప్తనదీ జలాలతో జ్యేష్ఠ మహాభిషేకం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఈ మహా జ్యేష్ఠాభిషేకానికి ఇతర రాష్ట్రాల్లో ఉన్న సప్త నదుల నుంచి సేకరించిన జలాలను ఆలయంలో బుధవారం అర్చకుల సమక్షంలో భద్రపర్చామన్నారు. శుక్రవారం జరిగే మహాజ్యేష్ఠాభిషేకంలో భక్తులు పాల్గొనడానికి ఆలయం వద్ద రూ.400 టిక్కెట్‌ను తీసుకోవాలన్నారు. ఉదయం 5.30గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, 9 గంటలకు మూలవరులకు సప్త నదీ జలాలతో మహా జ్యేష్ఠాభిషేకం నిర్వహించిన అనంతరం మహాశాంతి హోమం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు.

సికిల్ సెల్ ఎనీమియా అంటువ్యాధి కాదు

రాజమహేంద్రవరం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 19: సికిల్ సెల్ ఎనీమియా(కొండవలి కణ రక్తహీనత) అంటువ్యాధి కాదని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు గ్రామంలో ట్రైబల్ వెల్ఫేర్ బాలికల ఉన్నత పాఠశాలలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వెంకటేశ్వరావు మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి కేవలం జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో 45 ఏళ్ల లోపు ఉన్న వారికి అవగాహన కల్పించి, సార్వత్రిక నిర్ధారణ పరీక్షలు కౌన్సిలింగ్ ద్వారా ఈ వ్యాధిని అరికట్టడానికి ప్రణాళిక రచించిందన్నారు. జిల్లా ఆర్‌బీఎస్‌కె ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహమని రక్తంలో హెమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపబలిష్ఠంగా మారుతాయని తెలిపారు. ఆక్సిజన్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాలలో హెమోగ్లోబిన్ కొడవలి కణాలుగా మారి తద్వారా ఏ భాగంలో నైనా కణజాలం మారడం వలన రక్తహీనత పరిస్థితులకు దారి తీస్తుందని చెప్పారు. అనంతరం జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేవిఎన్ జ్యోతి, డీపీఎంయూ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ అభిషేక్ రెడ్డి జిల్లా ఎపిడమాలజిస్ట్ సుధీర్ బాబు మాట్లాడారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం వినియోగం, తరచు నీళ్ల తాగడంపై అవగాహన కల్పించారు. కళ్లు పసుపుగా మారడం, తీవ్రమైన ఒళ్ళు నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటం ఈ వ్యాధి లక్షణమని తెలిపారు. గర్భాధారణ సమయంలో సమస్యలు వస్తే అవయవనష్టం కలగవచ్చని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ వ్యాధి నిర్ధారించడానికి ఎలక్ట్రోఫోరోసిస్ అనే రక్త పరీక్ష ద్వారా మాత్రమే నిర్ధారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల హెడ్ మిస్టరీస్ బి.సీత, డిప్యూటీ వార్డెన్ బి.కరమ్మ, పీడీ జి.చిన్నారావు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

కడియపులంకలో చోరీ

10 కాసుల బంగారం, రూ.లక్ష అపహరణ



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కడియం, జూన్ 19: కడియపులంకలో భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడియపులంక గ్రామానికి చెందిన కర్రి వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం రాత్రి సమీపంలో ఉన్న అత్తారింటికి వెళ్లారు. ఈ సమయంలో వెంకటేశ్వరరావు ఇంటి తాళాలు బద్దలుగొట్టి బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువాను పగలకొట్టి అందులో ఉన్న 10 కాసుల బంగారు ఆభరణాలు, వెండి, రూ.లక్ష నగదు కాజేశారు. ఉదయం వెంకటేశ్వరరావు వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు బద్దలు గొట్టి ఉన్నట్లు, బీరువా తెరచి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, సీఐ తులసీధర్, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు సీఐ తులసీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కడియంలో జరిగిన మండల పరిషత్ సమావేశానికి వచ్చిన రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి విషయం తెలియడంతో కడియపులంక వెళ్లారు. వెంకటేశ్వరరావు సోదరుడు ఎస్సయ్యతో మాట్లాడారు. నిందితులను పట్టుకుని బంగారం, వెండితో పాటు నగదును కూడా రికవరీ చేసి వెంకటేశ్వరరావుకు న్యాయం చేయాలని పోలీసులకు చెప్పినట్లు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు.

జాతీయ రహదారి అలైన్‌మెంట్‌కు వ్యతిరేకంగా

బాధితుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న బాధితులు

మామిడికుదురు, జూన్ 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడిలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్వహిస్తున్న బైపాస్ రోడ్డు పనులను బుధవారం స్థానికులు అడ్డుకుని నిరసన చేపట్టారు. రెవెన్యూ అధికారులు 2014లో సర్వే చేసి దాని ప్రకారం రోడ్డు వేయకుండా కొంతమంది పెద్దల పలుకుబడి వల్ల అలైన్‌మెంట్ మార్చి పేదల భూముల్లో నుంచి బైపాస్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారని నిరసన తెలిపారు. అలైన్‌మెంట్ మార్చడం వల్ల చిన్న, సన్నకారు రైతులు తమకున్న కొద్దిపాటి భూమిని కోల్పోవలసి వస్తుందని వాపోయారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం రోడ్డు వేయాలని జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎన్‌హెచ్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించకపోవడంతో నేరుగా రాష్ట్రపతి ద్రౌపదీముర్ముకు అర్జీ పెట్టుకుంటున్నట్టు బాధిత రైతులు తెలియచేశారు. రాష్ట్రపతి వెంటనే స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని అర్జీ ద్వారా వేడుకున్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, మహిళలు పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి

చర్యలు తీసుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత



సమావేశం నిర్వహిస్తున్న గంధం సునీత

రాజమహేంద్రవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీకి యోగ్యమైన కేసులు అధిక మొత్తంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు ఆయా జిల్లాల ఎస్పీలతో బుధవారం సమావేశమై పలు సూచనలు చేశారు. సివిల్, క్రిమినల్, ప్రీ-లిటిగేషన్ కేసులతో పాటు అదనపు జిల్లా న్యాయస్థానాల్లోని మోటారు వాహనాల ప్రమాదాల కేసుల్లోని బాధితులకు తగు పరిహారం అందించడంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అలాగే బార్ అసోసియేషన్ల అధ్యక్షులతో కూడా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్పీలు పి.జగదీశ్, ఎస్.సతీశ్ కుమార్, ఏ.జగదీశ్, ఎస్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న జనసేన నాయకులు

జనసేన సంబరాలు

అమలాపురం టౌన్, జూన్ 19: ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా పవన్‌కల్యాణ్ బుధవారం బాధ్యతలు చేపట్టడంతో జనసేన నాయకులు, కార్యకర్తలు అమలాపురం గడియార స్తంభం సెంటర్లో సంబరాలు నిర్వహించారు. పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో ఇక నుంచి ప్రజా పాలన సాగుతుందని నాయకులు లింగోలు పండు, యేడిద శ్రీను, ఇసుకపట్ల రఘుబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో నాయకులు పిండి రాజా, ఆకుల బుజ్జి, నల్లా వెంకటేశ్వరరావు, కొప్పుల నాగమానస, తిక్కా సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న యువతి

ప్రియుడి ఇంటి ముందు యువతి ఆందోళన

కొత్తపల్లి, జూన్ 19: ప్రేమించి పెళ్లి చేసుకొంటానని మాయమాటలు చెప్పి పెళ్లి మాటకొస్తే ముఖం చాటేస్తున్న ప్రియుని ఇంటి ముందు ప్రియురాలు బుధవారం ఆందోళన ప్రారంభించింది. బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లి గ్రామానికి చెందిన ఎ.నవీన్‌కుమార్ అదే గ్రామానికి చెందిన పి.మానసను ప్రేమించి పెళ్లి చేసుకొంటానని హామీ ఇచ్చాడు. గత నాలుగు సంవత్సరాలుగా కలిసి తిరిగామని, ఇంకెంత కాలం పెళ్లి చేసుకోకుండా ఉంటామని తక్షణమే పెళ్లి చేసుకోవాలని యువతి ప్రియుడు కుమార్‌పై ఒత్తిడి తీసుకొచ్చింది. దీంతో కుమార్ ఇంట్లో పెద్దలు పెళ్లికి అంగీకరించడం లేదని హైదరాబాద్ వెళ్లిపోయాడని యువతి తెలిపింది. పెద్దల సమక్షంలో ఏప్రిల్ నెలలో నిశ్చితార్థం అయినా సరే హైదరాబాద్ వెళ్లి తిరిగి రాలేదని, ఇచ్చినమాట తప్పి తనను మోసం చేసి తప్పించుకొని తిరుగుతున్న కుమార్ పెళ్లి చేసుకొనే వరకు పోరాటం చేస్తానని, పెళ్లి చేసుకోకపోతే ప్రాణత్యాగం చేస్తానని యువతి ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో ఇరువర్గాల పెద్దలు కొత్తపల్లి పోలీసులను ఆశ్రయించడంతో చర్యలు చేపట్టారు.

అనుమానం పెనుభూతమై..

● భార్యను హతమార్చిన భర్త ● కాకినాడ రూరల్ హార్బర్ పేట హత్య కేసు ఛేదన



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సర్పవరం జంక్షన్, జూన్ 19: కాకినాడ రూరల్ హార్బర్‌పేటలో సంచలనం రేకెత్తించిన వివాహిత హత్య కేసును పోలీసులు ఛేదించారు. భార్యపై ఉన్న అనుమానం పెనుభూతంగా మారడంతో పాటు అప్పులు తీర్చేందుకు నగలు ఇవ్వడానికి నిరాకరించడంతో ఈ హత్యకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. అరెస్ట్ వివరాలను బుధవారం సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ వివరించారు. కాకినాడ రూరల్ హార్బర్‌పేటలో నివాసం ఉంటున్న ఓలేటి నరసింహమూర్తి భార్య ఓలేటి సీత (26)ను ఈనెల 16వ తేదీన రాయితో కొట్టి హత్యకు పాల్పడ్డాడు. అయితే తప్పించుకునేందుకు తన భార్య ఒంటిపై ఉన్న పుస్తెలతాడు, చెవి దిద్దులు కోసం ఎవరో హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే సీత తల్లి మాత్రం అల్లుడే డబ్బుల కోసం తమ కుమార్తెను హత్య చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కాకినాడ ఎస్‌డీపీవో హనుమంతరావు ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌వో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భర్తే సీతను హత్య చేసినట్లు పోలీసులు దర్యాప్తులో తేల్చి నిందితుడ్ని అరెస్ట్ చేశారు. ఓలేటి నరసింహమూర్తికి ఎనిమిదేళ్ల కిందట సీతతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. సీత వలసపాకల రొయ్యల కంపెనీలో పనిచేస్తోంది. భర్త కాకినాడ పోర్టులో సెక్యూరిటీగా పని చేస్తున్నాడు. భార్యపై అనుమానంతో గత రెండు నెలలుగా వేధింపులకు పాల్పడుతూ ఇతరులతో వివాహేతర సంబంధం అంటకట్టి వేధించేవాడు. రూ. 3.50 లక్షలు అప్పుచేసి వైసీపీపై బెట్టింగ్ కాయగా, డబ్బులు పోయాయి. దాంతో డబ్బుల కోసం భార్య ఒంటిపై ఉన్న బంగారు వస్తువులు ఇమ్మని వేధించాడు. ఈ విషయమై భార్యాభర్తల నడుమ వాగ్వాదం చోటుచేసుకుంది. ఈనెల 16న ఉదయం 6.30 గంటలకు సీతను ఎవరో తలపై కొట్టి హత్యచేసి బంగారు వస్తువులను పట్టుకుపోయారని తల్లికి సమాచారం రావడంతో వెళ్లి చూడగా కుమార్తె తలపై రక్తంతో ఉండటం, బంగారు వస్తువులు కనిపించలేదు. తన కుమార్తెను అల్లుడే హత్య చేశాడని అనుమానం వ్యక్తంచేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో హనుమంతరావు పర్యవేక్షణలో సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్, సీఐ ఎ.సన్యాసిరావు, పోర్టు ఎస్‌హెచ్‌వో వి.సుమంత్ దర్యాప్తు చేశారు. భర్త నరసింహమూర్తి భార్యను హత్య చేసినట్లు గుర్తించి బుధవారం హార్బర్‌పేటలో అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. భార్య హత్యకు ఉపయోగించిన రక్తపు మరకలు కలిగిన రాయి, బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

పెండింగ్ కేసులు వేగంగా దర్యాప్తు చేయాలి : డీఎస్పీ

గండేపల్లి, జూన్ 19: పెండింగ్ కేసులు వేగంగా దర్యాప్తు చేయాలని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి సూచించారు. బుధవారం ఆమె గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రికార్డులు పరిశీలించారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ ఎన్.రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

‘విద్యార్థులు జ్ఞాన సముపార్జన చేయాలి’

తొండంగి, జూన్ 19: సామాజిక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు జ్ఞాన సముపార్జన చేయాలని సీబీఎస్ఈ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎంవీవీప్రసాదరావు సూచించారు. బుధవారం ఆయన పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాల సప్తమ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. నిరంతరం నూతన నైపుణ్యాలను పెంపొందించుకుంటూ జీవితంలో ఉన్నతస్థాయికి చేరేందుకు ప్రయత్నించాలన్నారు. నైతిక విలువలకు ప్రాధాన్యత నిస్తూ ఉత్తమ పౌరుడిగా ఎదిగి దేశాభివృద్ధిలో భాగస్తులవ్వాలన్నారు. ఆయన రూ.50 వేల విలువైన పుస్తకాలను కళాశాలకు బహూకరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ వార్షిక నివేదికను చదివి వినిపించారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సామాజికవేత్త నరేష్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిల్లి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాము, వైస్ ప్రిన్సిపాల్ దివాకర్, కృష్ణారావు, మహాలక్ష్మి నాయుడు, విజయ వర్ధన్ పాల్గొన్నారు.

‘బీమా మిత్రలను విధుల్లోకి తీసుకోవాలి’

ప్రత్తిపాడు, జూన్ 19: బీమా మిత్రలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజవర్గానికి చెందిన బీమా మిత్రలు బుధవారం స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత టీడీపీ హయంలో బీమా మిత్రలుగా ఎంతో సేవలందించిన తమను వైసీపీ ప్రభుత్వం తొలగించిందని, చంద్రబాబు ప్రభుత్వం తిరిగి తమను విధుల్లోకి తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని వారు కోరారు. ప్రత్తిపాడు, రౌతులపూడి, శంఖవరం, గండేపల్లి, కిర్లంపూడి, ఏలేశ్వరం మండలాల బీమా మిత్ర సంఘాల నాయకురాళ్ళు సీహెచ్ పెద్దతల్లి, కె.పాపతల్లి, ఈ.సుధారాణి, బి.బేబి, కె.పుష్పలత, కె.లోవకుమారి, ఎం.మరియ పాల్గొన్నారు. సీసీఎం మండలాధ్యక్షుడు రొంగల ఈశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

‘గోశాల సంరక్షణ, అభివృద్ధికి కృషి’

సర్పవరం జంక్షన్, జూన్ 19: జంతు హింస నివారణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాల సంరక్షణ, అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ భార్య అరుణ తెలిపారు. బుధవారం రమణయ్యపేట ఒకటో డివిజన్‌లో ఉన్న గోశాలలోని ఆవులకు రేపూరు, చీడిగ గ్రామాలకు చెందిన జనసేన నాయకులు బూరయ్య, ఆదినారాయణ, పెదకాపు, నరసింహరావులు అందించిన ట్రాక్టర్ పచ్చగడ్డిని నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోశాలలో ఉన్న గోవుల ఆకలిని తీర్చేందుకు దాతలు పశుగ్రాసాన్ని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మంతెన వర్మ పాల్గొన్నారు.

‘ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తాం’

గొల్లప్రోలు రూరల్, జూన్ 19: ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు ఉన్నత చదువులకు అండగా ఉంటామని సాయిప్రియ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ తెలిపారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన దేశినీడి శ్రీహర్ష(600కి 580 మార్కులు), నాగనీడి ఇందూ(575), ఇంటి శివచక్రహరి(570)లతో పాటు విభిన్న ప్రతిభావంతులు, వారికి సహకరించిన విద్యార్థులను బుధవారం సత్కరించి పురస్కారాలు అందజేశారు. నూతన తరగతి గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పంపన సూర్యచంద్రరావు, కందా శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులున్నారు.

‘వైసీపీ నాయకులకు అవకాశం ఇవ్వొద్దు’

గొల్లప్రోలు, జూన్ 19: గత వైసీపీ ప్రభుత్వ పాలనలో టీడీపీ, జనసేన నాయకులను ఇబ్బందులకు గురిచేసి పోలీసు కేసులు పెట్టించిన వైసీపీ నాయకులు జనసేనలోకి చేరే ప్రయత్నాలు చేస్తున్నారని, అటువంటి వాటికి అవకాశం ఇవ్వవద్దని బీజేపీ గొల్లప్రోలు పట్టణాధ్యక్షుడు చిట్టా మధు డిమాండ్ చేశారు. ఈ విషయాలను జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లతామని బుధవారం తెలిపారు. కాకినాడ ఎంపీతో పాటు ఇతర నేతల ద్వారా వైసీపీ సర్పంచ్‌లు, నాయకులు జనసేన, ఇతర పార్టీల్లోకి వచ్చేందుకు లాబీయింగ్ చేస్తున్నారని విమర్శించారు. వారంతా పవన్‌ను ఓడించేందుకు కృషి చేసిన విషయాన్ని మర్చిపోకూడదని ఆయన తెలిపారు.

తునిలో 23న టీడీపీ విజయోత్సవ సభ

తునిరూరల్, జూన్ 19: తునిలో ఎమ్మెల్యేగా యనమల దివ్య విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 23న తుని పార్టీ కార్యాలయం నుంచి పట్టణ పురవీధుల మీదుగా రాజా కళాశాల ప్రాంగణంలో విజయోత్సవ సభ ఏర్పాటు చేయనున్నట్టు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు తెలిపారు. ఈ సభకు శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, మంత్రులు వంగలపూడి అనిత, కందుల దుర్గేష్, టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, పలువురు హాజరవుతారన్నారు. ఈ మేరకు రాజా కళాశాల ప్రాంగణాన్ని పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట టీడీపీ యువనేత యనమల రాజేష్, చింతమనీడి నాగ సోమరాజు, మోతుకూరి వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయణ, కుసుమంచి సత్యనారాయణ ఉన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

గొల్లప్రోలు, జూన్ 19: పట్టణానికి చెందిన వ్యక్తి అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన దొమ్మేటి లోవకుమార్ గత 16 ఏళ్లుగా మెయిన్‌రోడ్డులో వడ్డీ వ్యాపారం నిర్వహించే అంకిత్‌జైన్ వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఇంటి నుంచి డ్యూటీకి వెళ్లిన తర్వాత మధ్యాహ్నం భోజనానికి రాలేదు. కొంతకాలంగా తన యజమాని అంకిత్‌జైన్ వేధింపులకు గురిచేస్తున్నట్టు చెప్పి బాధపడేవాడని, అతడిపైనే తమకు అనుమానం ఉందని భార్య దొమ్మేటి దుర్గాభవానీ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కాగా బ్యాంకులో కట్టమని రూ.5లక్షలు తన వద్ద పనిచేసే దొమ్మేటి లోవకుమార్‌కు ఇచ్చి పంపానని, అయితే అతడు బ్యాంకులో సొమ్ము జమచేయలేదని అకింత్‌జైన్ గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతను తిరిగి రాలేదని, ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తున్నదని తెలిపారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. కాగా లోవకుమార్ విషయంలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు పలు ప్రాంతాల్లో సీసీ ఫుటేజీలు పరిశీలించారు.

మహిళల మధ్య వివాదంపై కేసు

జగ్గంపేట, జూన్ 19: డబ్బుల విషయంలో ఇద్దరు మహిళల మధ్య జరిగిన వివాదం కొట్లాటకు దారి తీసింది. మల్లిశాలకు చెందిన దర్శిపాటి రమణమ్మ నుంచి అదే గ్రామానికి చెందిన రింగుల మార్తమ్మ రూ.10వేలను మూడేళ్ల క్రితం అప్పు తీసుకుంది. వడ్డీ డబ్బుల కోసం ఇద్దరి మధ్య వివాదం జరుగుతోంది. రెండేళ్ల క్రితమే అప్పు తీర్చేశానని మార్తమ్మ, వడ్డీ చెల్లించలేదని రమణమ్మ అంటుంది. ఈనెల 15న గ్రామంలో కుళాయి వద్ద ఇద్దరూ గొడవ పడ్డారు. రమణమ్మ భర్త వచ్చి మార్తమ్మను రాయితో తలపై కొట్టాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంటి వాకిలి తుడుచుకుంటుండగా రమణమ్మ వచ్చి దాడి చేసిందని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

దుర్గాడలో వడదెబ్బతో వ్యక్తి మృతి

గొల్లప్రోలు రూరల్, జూన్ 19: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వడదెబ్బతో వ్యక్తి మరణించాడు. గ్రామానికి చెందిన దెయ్యాల కృష్ణ(48) కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తూ ఉంటాడు. బుధవారం రోడ్డు మీదకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చి అరుగుపై కూర్చొన్నాడు. అస్వస్థతగా ఉందని చెప్పిన కొంత సమయానికే అరుగుపై నుంచి పడిపోయి మరణించాడు. దీనిపై అతడి కుమారుడు దెయ్యాల శేఖర్ గొల్లప్రోలు పోలీసులకు చేయగా వడదెబ్బ మృతిగా కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ప్రత్తిపాడులో వైద్యులు, సిబ్బంది ప్రదర్శన

ప్రత్తిపాడు, జూన్ 19: ప్రపంచ సికిలి సెల్‌డే సందర్భంగా రక్తహీనత, జెనిటిక్ లోపం కారణంగా తలెత్తే పరిణామాలు వివరిస్తూ బుధవారం ప్రత్తిపాడులో కమ్యూనిటీహెల్త్ సెంటర్ వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ సికిలి సెల్ నిమోనియా వ్యాధి వల్ల ప్రతి మనిషిలో 120రోజుల్లో ఉత్పత్తి అయ్యే ఎర్ర రక్తకణాలు తగ్గుతాయని, దీని వల్ల పిల్లల్లో రక్తహీనత, ఊపిరితిత్తుల్లో ఇబ్బందులు, కంటిచూపు తగ్గడం వంటివి సంభవిస్తాయన్నారు. నివారణకు చేపట్టాల్సిన అంశాలు తెలిపారు.

తుమ్మలను కలిసిన కార్మికులు

పెద్దాపురం, జూన్ 19: ఏడీబీ రహదారిలో ఉన్న రాక్ సిరామిక్ పరిశ్రమలో పనిచేస్తున్న 24 మంది కార్మికులను అక్రమంగా తొలగించడంపై తమకు న్యాయం చేయాలని కోరుతూ కార్మికులు సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు)ను కలిశారు. కార్మికులను తొలగించి ఇప్పటికీ 65 రోజులయ్యిందని దీనిపై తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. దీంతో ఆయన జాయింట్ లేబర్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. త్వరితగతిన చర్యలు తీసుకుని, కార్మికులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దారపురెడ్డి క్రాంతికుమార్, సూరిబాబు, గంగాధర్ ఉన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు

సామర్లకోట, జూన్ 19: పట్టణ పరిధిలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారుల బృందం బుధవారం తనిఖీ చేసింది. జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకురాలు పీ.మాధవి, బయోలాజికల్ లాబరేటరీ ఏవో ఎం.అరుణ, జిల్లా భూసార కేంద్రం ఏవో సుధా మాధురి, సామర్లకోట ఎంఏవో ఇమ్మిడిశెట్టి సత్య ఎరువులు, పురుగుమందుల దుకాణాలకు చెంది రెన్యూవల్స్ సక్రమంగా నిర్వహించారా, విక్రయ దారుడికి విద్యా అర్హతలున్నాయా తదితర అంశాలను పరిశీలించారు. గోదాములలో ఎరువుల నిల్వలను లెక్కించి రిజిష్టర్‌లో నమోదుకు సరిచూశారు. కాగా పట్టణం, మండలంలోనూ తనిఖీలు నిర్వహిస్తామని డీఆర్సీ ఏడీఏ మాధవి తెలిపారు.

వసతిగృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

కలెక్టర్ నివాస్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 19: జిల్లాలో సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాలో సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతిగృహాల ప్రస్తుత పరిస్థితి, మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం, నాడు-నేడు పనులు వసతిగృహాల్లో భోజనం, ఆరోగ్య పరీక్షలు తదితర అంశాలపై కలెక్టర్ జిల్లా సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 33 ఎస్సీ, 41 బీసీ సంక్షేమ వసతిగృహాలు ఉన్నాయన్నారు. వసతిగృహాల్లో ఉన్న పిల్లల బాగోగులు బాధ్యత పూర్తిగా సంబంధిత వసతిగృహాలు అధికారుల దేన్నారు. తాను రెండేళ్లపాటు వసతిగృహంలో ఉండి చదువుకున్నానని, సంక్షేమ వసతిగృహాల్లో సమస్యల పై తనకు పూర్తి అవగాహన ఉందని అన్నారు. 2024-25 విద్యాసంవత్సరం తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో ఉన్న ఎస్సీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలన్నారు. అధికారులు ప్రణాళిక ప్రకారం పనిచేయాలన్నారు. వసతిగృహాల్లో విద్యుత్, ట్యూబ్ లైట్లు, మరుగుదొడ్లలో పరిశుభ్రత, బాత్రూం డోర్లు, నీటి సరఫరా తదితర అంశాలపై దృష్టిపెట్టాలన్నారు. బాలికల వసతిగృహాల్లోకి అపరిచిత వ్యక్తులు లోపలికి రాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి 15రోజులకు ఒకసారి స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రమణమూర్తి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి లల్లి, జిల్లా సంక్షేమ వసతిగృహాల సమన్వయ అధికారి వెంకటరావు, ఎస్సీబీసీ అసిస్టెంట్ సంక్షేయాధికారులున్నారు.

ఎమ్మెల్యే నెహ్రూకు సత్కారాలు



ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను సత్కరిస్తున్న గండేపల్లి మండల ఆర్యవైశ్య సంఘ సభ్యులు

జగ్గంపేట, జూన్ 19: స్థానిక రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నందు గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు పెనుమర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. పెనుమర్తి అర్జున్‌రావు, బొచ్చు మల్లేశ్వరరావు, మద్దిపూడి మణిప్రసాదద్, కొనిజెల శ్రీను, సుంకవిల్లి చౌదరి, చిన్ని, సుంకవిల్లి చౌదరి పాల్గొన్నారు. ఆధ్యాత్మికవేత్త నాగేశ్వర శర్మ నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీస్సులు అందించారు. జేవీఆర్ గ్రూప్స్ అధినేత జీనుమణిబాబు, కొత్త కొండబాబు, నండ్ల చిరంజీవి పాల్గొన్నారు. అలాగే గండేపల్లి మండల ఆర్యవైశ్య సేవా సంఘం ప్రతినిధులు నెహ్రూను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త చిన్న వీరభద్రరావు, గ్రంది నాగ సుబ్రహ్మణ్యం, కొత్త వీర్రాజు, గ్రంధి నాగబాబు, చెక్క గంగరాజు, బత్తుల నానాజీ, గొల్లపూడి సాయి, మామిడిపాక వెంకటరత్నం, వకచర్ల బాబ్జి, వకచర్ల నాగేశ్వరరావు, మండవిల్లి సుబ్బారావు, బబేజగం కోటేశ్వరరావు పాల్గొన్నారు. జగ్గంపేట మండల మీ సేవా కేంద్రాల నిర్వాహకులు నెహ్రూను కలిశారు. నాగేశ్వరావు,శివన్నారాయణ, వెంకటరత్నం,అజయ్ ఉన్నారు.

యనమలను కలిసిన జ్యోతుల

తుని రూరల్, జూన్ 19: జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడిని తేటగుంట టీడీపీ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట జగ్గంపేటకు చెందిన పలువురు టీడీపీ నాయకులు నాయకులున్నారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన సత్యప్రభ



ఎస్పీని కలిసిన సత్యప్రభ

ప్రత్తిపాడు, జూన్ 19: జిల్లా కలెక్టర్ కె.నివాస్, ఎస్పీ సతీష్‌కుమార్‌లను బుధవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కలిశారు. కాకినాడ తరలివెళ్లి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. అనంతరం ఎస్పీని కలిసి బొకే అందజేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలని కలెక్టర్‌ను కోరారు. తేటగుంట తరలివెళ్లి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని కలిసి నియోజకవర్గంలోని పరిస్థితులపై ఆమె చర్చించారు.

ఎమ్మెల్యే దాట్లను కలిసిన నేతలు

తాళ్లరేవు, జూన్ 19: ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును పి.మల్లవరం పంచాయతీ, సచివాలయం సిబ్బంది టీడీపీ నేత ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం కలసి అభినందనలు తెలియజేశారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు ఆధ్వర్యంలో బీసీ నేతలు కలసి అభినందనలు తెలియజేశారు. బీసీ నేతలు పిల్లి సత్తిబాబు, గంజా సూరిబాబు, మేడిశెట్టి సత్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, వాతాడి శ్రీను, పెన్నాడ వేణి పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌ను కలిసిన మల్లాడి

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 19: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను జనసేన కాకినాడ పార్లమెంటు ఎన్నికల కమిటీ సభ్యుడు డాక్టర్ మల్లాడి రాజేంద్రప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బస్వాని నాగబాబు, వరిపిల్లి ప్రసాద్, నురుకుర్తి సాయి, సంగానీ బాలమహేశ్వరరావు, వీరెల్లి ఏసుప్రసాద్ ఉన్నారు.

పూడికల తొలగింపు ప్రారంభం

కరప, జూన్ 19: కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ చొరవతో కేఎంజే కెనాల్‌లో పూడికలు తొలగింపు పక్రియ ప్రారంభమయ్యింది. కాకినాడ మంజేరు జగన్నాధగిరి(కేఎంజే) కెనాల్ పలుచోట్ల పూడుకుపోవడంతో పెనుగుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి, జి.వేమవరం తదితర గ్రామాలకు సాగునీరందే పరిస్థితి లేకుండా పోయింది. పరిస్థితిని జనసేన నాయకులు ఎమ్మెల్యే నానాజీకి వివరించారు. వెంటనే స్పందించిన ఆయన ఇరిగేషన్, డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడికలు తొలగించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అయితే నిధుల కొరత వల్ల పనులు చేపట్టలేమని అధికారులు నిస్సహాయతను వ్యక్తపరచడంతో ఎమ్మెల్యే సొంత ఖర్చుతో ప్రొక్లెయినర్లను పురమాయించారు. పెనుగుదురు వద్ద కేఎంజే కెనాల్, పాతర్లగడ్డ కర్రవంతెన, కరప వెంకటప్పయ్య డ్రైన్‌లలో బుధవారం గుర్రపుడెక్క, పూడికతీత పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే తనయుడు పంతం సందీప్ ఈ పనులను పరిశీలించి రైతులతో చర్చించారు. ఎమ్మెల్యే నానాజీకి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. జనసేన మండలాధ్యక్షుడు బండారు మురళి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోగిరెడ్డి గంగాధర్, బోగిరెడ్డి కొండబాబు, మండల ఉపాధ్యక్షుడు అనుకుల రాంబాబు, తుమ్మలపల్లి మాచరరావు, రెడ్డిపల్లి భాస్కర్, యాళ్ల వీరవెంకటసత్యనారాయణ(పండు) తదితరులు ఉన్నారు.

‘చదువుతోనే బంగారు భవిష్యత్’

కరప, జూన్ 19: చదువుతోనే బంగారు భవిష్యత్ ఏర్పడుతుందని తల్లిదండ్రులు గ్రహించి తమ పిల్లలను విధిగా బడులకు పంపించాలని ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ సూచించారు. కరప శివారు పేపకాయలపాలెంలో బుధవారం ఉపాధ్యాయులు, గ్రామస్తులు, నాయకులతో కలిసి నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. బడిబయట పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. టీడీపీ, జనసేన నాయకులు మద్దూరి స్వామి, బోగిరెడ్డి కొండలరావు, బోగిరెడ్డి గంగాధర్, వార్డు సభ్యుడు పేపకాయల రాజు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలి

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, జూన్ 19: ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలని పెద్దాపురం ఎమ్మెల్యే విజేత నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న తోటకూర వెంకటేశ్వరరావు (చంటిబాబు) స్మారక క్రికెట్ టోర్నమెంట్ పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ బుధవారం రాత్రి నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 32 టీములకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. విన్నర్స్‌గా రంగంపేట టీం, రన్నర్స్‌గా పెదబ్రహ్మదేవం టీం నిలవగా ప్రథమ బహుమతిగా రూ.30వేల నగదు, షీల్డులు.. రన్నర్స్‌కు రూ.20వేల నగదు, షీల్డ్‌లను ఎమ్మెల్యే జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబులు అందజేశాన్నరు. తృతీయ బహుమతిగా రూ.10వేల నగదు, షీల్డ్‌లను అందజేశారు. నాగబాబు, పాలకుర్తి శ్రీనుబాబు, గుమ్మళ్ళ రామకృష్ణ, చీకట్ల వెంకటేష్, కుర్రా నారాయణ స్వామి, మామిడాల రామకృష్ణ పాల్గొన్నారు.

రాజప్పకు అభినందనలు



రాజప్పను సత్కరిస్తున్న ఏపీఎన్‌జీవో నాయకులు

పెద్దాపురం ఎమ్మెల్యేగా మూడోసారి గెలుపొందిన నిమ్మకాయల చినరాజప్పను అభినందిస్తూ సామర్లకోట 28వ వార్డు నూకాలమ్మ ఆలయం వద్ద పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. కార్యకర్తలు ఏర్పాటుచేసిన పసుపు రంగు భారీ కేక్‌ను రాజప్ప కట్ చేసి టీడీపీ నాయకులకు అందించారు. జనసేన నాయకులు పాల్గొన్నారు. రాజప్పను ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గం సామర్లకోట మండలం అచ్చంపేటలోని ఎమ్మెల్యే చినరాజప్ప స్వగృహంలో పూలమాలలతో అభినందించారు. ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు గుద్దటి రామమోహనరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలు కప్పి సత్కరించి అభినందించారు. సంఘ నాయకులు పేపకాయల వెంకటకృష్ణ, మట్టపర్తి వెంకటేశ్వరరావు, అరదాడి సత్తిరాజు, కె.శివప్రసాద్, నరేష్, బి.వి.జయలక్ష్మి, బి.వెంకటలక్ష్మి, టి.ఛార్లెస్‌పాల్, షేక్ అజీజ్, పులి బాల వెంకటరమణ, ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో గాడి తప్పిన అభివృద్ధి

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి

కాకినాడ సిటి, జూన్ 19: గత వైసీపీ ప్రభుత్వంలో గాడి తప్పిన కాకినాడ నగర అభివృద్ధిని గాడిలో పెట్టేందుకు కార్యాచరణకు శ్రీకారం చుట్టినట్టు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఇతర అధికారులతో కలిసి సంజీవనగర్ డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జనావాసాల మధ్య ఉన్న డంపింగ్ యార్డ్‌ను తరలించేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నగరానికి దూరంగా ఎస్ఎఫ్‌సీఎల్ సంస్థకు చెందిన 20 ఎకరాల భూమిని సేకరించి సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ రూపకల్పనకు ప్రతిపాదనలు చేయగా మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి తన అక్రమ సంపాదనకు జనావాసాల మధ్య ఉన్న డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని గంజాయి, డ్రగ్స్ అసాంఘిక కార్యకలాపాలను నిర్వహించడానికి అనువైన ప్రాంతంగా ఎంచుకున్నారన్నారు. ఈ ప్రాంతంలో అధికసంఖ్యలో లారీలు ఎగుమతి, దిగుమతులకు సంబంధించి ఎక్కువ భాగం కార్యకలాపాలు సాగిస్తున్నాయన్నారు. ఈ రోడ్డును డంపింగ్ యార్డ్ నుంచి కాకినాడ పాత రైల్వేస్టేషన్ వరకు తక్షణం పునరుద్ధరించే ప్రయత్నం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు, పోర్టు సీఐ సుమంత్, టీడీపీ కాకినాడ నగర అధ్యక్షుడు వీరు, బాలాజీ, సాయిబాబా, అశోక్, రాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో డీఈవో రమేష్ తనిఖీలు



గొల్లప్రోలు పాఠశాలలో తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఈవో

గొల్లప్రోలు, జూన్ 19: గొల్లప్రోలు పట్టణంతో పాటు మండల పరిధిలోని పాఠశాలల్లో జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల ఎన్‌రోల్ మెంట్, పదో తరగతి పరీక్షల ఫలితాలపై సమీక్షించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సబ్జెక్టుల వారీగా విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనా వేసి తదనుగుణంగా విద్యాబోధన చేయాలన్నారు. చదవడం, రాయడం సరిగా రాని విద్యార్థులను లాంగ్వేజ్ ఉపాధ్యాయులు గుర్తించాలని చెప్పారు. చెందుర్తిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 8,9 విద్యార్థుల ప్రగతిని పరిశీలించి సంతృప్తి చెందారు. ఈబీసీ కాలనీ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించి ఆవరణ అంతా అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్వో ప్లాంటు వినియోగించకుండా వదిలివేయడంతో దుమ్ము పట్టి ఉండటాన్ని గుర్తించారు. ఉపాధ్యాయుల పనితీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెరుగు పరుచుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఈవో-2 శివప్రసాద్, సీఆర్పీలు రామకృష్ణ, నాగేశ్వరరావు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఉన్నారు.

‘అవినీతిపై పోరాటం’



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ఏలేశ్వరం, జూన్ 19: పట్టణం, గ్రామాల్లో గతంలో జరిగిన అవినీతి, అక్రమాలపై పోరాటం చేస్తామని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. బుధవారం ఏలేశ్వరంలో మండ పరిషత్ కార్యలయంలో ఎన్డీఏ కూటమి నాయకులు ఏర్పాటు చేసుకున్న సమావేశంలో బుజ్జి మాట్లాడుతూ వైసీపీ నాయకులు అక్రమ నిర్మాణాలు చేపట్టి, అనుమతులు ఉన్నాయని నమ్మబలుకుతున్నారు. గత పాలనలో నియంతృత్వంగా వ్యవహరించిన కొందరు ప్రస్తుతం తమకు ఇతోక్తులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. లింగంపర్తిలో చేపట్టిన దుకాణాల నిర్మాణాలకు అనుమతి లేదని తాము అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. యంత్రాంగం స్పందించకపోవడంతో ఆందోళన చేపట్టామన్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే వైసీపీ నాయకులు బెదిరింపులకు దిగుతున్నారన్నారు. సమావేశంలో మండల అధ్యక్షులు సూతి బూరయ్య, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, అలమండ చలమయ్య, కోనాల వెంకటరమణ, యండగుండి నాగబాబు, రాయుడు చిన్న, చిక్కాల లక్ష్మణరావు, గట్టెం వెంకటరమణ, రెడ్డి లోవరాజు, కార్యకర్తలున్నారు.

పారిశుధ్య విభాగాన్ని పూర్తిగా గాడిలో పెట్టేందుకు చర్యలు

కాకినాడ కమిషనర్ వెంకటరావు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 19: ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైన పారిశుధ్య విభాగాన్ని పూర్తిగా గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. పారిశుధ్య పనుల్లో ఎలాంటి అలసత్వాన్ని ప్రదర్శించిన ఉపేక్షించబోనన్నారు. గాంధీనగర్, రైతుబజార్, వెంకటనగర్, సిద్ధార్థనగర్, శంతనపురికాలనీ, కొత్తపేటమార్కెట్, కొత్తకాకినాడ ప్రాంతాల్లో బుధవారం తనిఖీలు చేశారు. ఆయన వెంట ఆరోగ్యాధికారి డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ, పోలీస్, విద్యుత్‌శాఖల సమన్వయంతో ట్రాఫిక్‌కు అవరోధంగా ఉన్న సమస్యలు, ఇతర అంశాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ఆయన డీఎస్పీ హనుమంతరావు, ఎస్ఈ పి.సత్యకుమారి ఆయా విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. 3 శాఖలు చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. సమావేశంలో స్మార్ట్‌సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, ట్రాఫిక్ సీఐలు చైతన్యకృష్ణ, ఎన్.రమేష్, టూటౌన్ సీఐ నాగేశ్వర్‌నాయక్ ఉన్నారు.

‘పవన్‌కల్యాణ్‌తో పంచాయతీ వ్యవస్థ పటిష్టం’

సర్పవరం జంక్షన్, జూన్ 19: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పంచాయతీరాజ్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కల్యాణ్‌తో పంచాయతీ వ్యవస్థ పటిష్టం కానుందని రమణయ్యపేట మాజీ సర్పంచ్, సామాజిక సేవకులు అడబాల రత్నప్రసాదరావు అన్నారు. బుధవారం సర్పవరం జంక్షన్‌లో మంత్రిగా పవన్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చంద్రరావు, రవిశంకర్ పట్నాయక్, గల్లా సుబ్బారావు, నగేష్ తదితరులు ఉన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ఎస్పీ పూజలు



సత్యదేవుడి దర్శనానంతరం ఎస్పీ సతీష్‌కుమార్

అన్నవరం, జూన్ 19: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిదిలో బుధవారం జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ సూపరెంటెండెంట్ స్వామీజీ, ఏపీఆర్వో ఎం.గణపతిరావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అన్నవరం ఎస్ఐ కిషోర్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ



ఎన్‌సీసీ క్యాడెట్లతో ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి

పెద్దాపురం, జూన్ 19: ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుందని ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి అన్నారు. స్థానిక జవహర్ నవోదయా విద్యాలయంలో ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షూటింగ్ కాంపిటేషన్‌కు ఎంపికైన క్యాడెట్లతో ఆయన బుధవారం ముచ్చటించారు. ఎన్‌సీసీతో క్రమశిక్షణతో పాటు ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతుందన్నారు. దేశానికి తమ వంతు సేవ చేయడానికి ఎన్‌సీసీ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఆయన క్యాంపును సందర్శించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో గ్రాడ్యుయేషన్ డే



కాకినాడ అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 19: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కాకినాడ అర్బన్ పరిధిలోని దుమ్ములపేట సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారుల ‘గ్రాడ్యుయేషన్ డే-అంగన్‌వాడీ పిలుస్తుంది’ కార్యక్రమాన్ని సీడీపీవో ఎజ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి కె.ప్రవీణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 21మంది పిల్లలకు గ్రాడ్యుయేషన్ చేసి సర్టిఫికెట్ అందజేశారు. తల్లులకు ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ చేయడం వల్ల కలిగే లాభాలు, అంగన్‌వాడీలో మూడేళ్లు నిండిన పిల్లలను చేర్పించడం వల్ల పిల్లల్లో జరిగే 5 రకాల అభివృద్ధులపై పీడీ, సీడీపీవోలు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దయామణి, ఎంఎస్‌కేలు, తల్లులు ఉన్నారు.

సామర్లకోట: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.మంగ ఆధ్వర్యంలో బలుసుల పేట సచివాలయం నందు నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా పెద్దాపురం ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సీడీపీవో జీ.ఉషా మాట్లాడారు. అంతకముందు చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ సిబ్బంది పి.సూర్యప్రభ, పిజ సత్యశార్వాణీ, కె.రాణీ, ఆర్.నాగమణి, సోమసుప్రీత చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

దళిత సంఘం నేతల హర్షం

తాళ్లరేవు, జూన్ 19: జగనన్న విదేశీ విద్య పథకానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విదేశీవిద్యగా రాష్ట్ర ప్రభుత్వం మార్పు చేయడంతో తాళ్లరేవు మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంటపల్లి చంద్రమౌళి, దున్నా సుబ్రహ్మణ్యం హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ వైసీపీ రద్దు చేసిన ఎస్సీ ఎస్టీల సంక్షేమ 27 పథకాలను పునరుద్ధరించాలని కోరారు.

‘పీఎం జన్‌మాన్’ ప్రారంభం

తుని రూరల్, జూన్ 19: వి.కొత్తూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం జన్‌మాన్ కార్యక్రమాన్ని టీడీపీ యువ నేత యనమల రాజేష్ ప్రారంభించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీపీ బొప్పన రాము, మోతుకూరి వెంకటేష్, చింతమనీడి అబ్బాయి, తేటగుంట పీహెచ్‌సీ డాక్టర్ సాహిత్ తదితరులున్నారు.

‘పార్కును అభివృద్ధి చేయాలి’

పిఠాపురం, జూన్ 19: పట్టణంలోని ఉప్పాడ బస్టాండు సెంటర్‌లో గల చిన్నమాంబా పార్కును అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. పార్కు పరిశీలనకు బుధవారం వచ్చిన మున్సిపల్ కమిషనర్ కనకారావుకు వారు అక్కడ ఉన్న సమస్యలు, ఇబ్బందులు వివరించారు. వాటిపై పరిశీలన చేయించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.

తునిలో సర్వసభ్య సమావేశం

తునిరూరల్, జూన్ 19: సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలని తుని ఎంపీపీ బొప్పన రాము స్పష్టం చేశారు. ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు హాజరయ్యారు. రెవెన్యూ, విద్యాశాఖ, వ్యవసాయశాఖ, విద్యుత్, హార్టికల్చర్ శాఖలపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.